
# గోడమీది పిల్లి



-మధునాపంతుల సత్యనారాయణమూర్తి

అలారాయకుండా ఉండాల్సింది. తీరా రాసాక... ప్రయోజనం ఏముంటుంది? బాణం వదిలాక గాయం ఔతుందని దిగులు చెందడం ఎందుకు? నేనేమైనా రచయితనా! పాడా! వచ్చిన పది భావాలూ అందంగా ప్రకటించడానికి? సరే... నాకవసరమైన భాషా, భావప్రకటనా స్వేచ్ఛ... నా కుండనే ఉన్నాయి.

ఐనా... కొంచెం తొందరపడ్డానేమో! ఒకటికి పదిసార్లు చూసుకొని ఉంటే బాగుండేదేమో. అక్కడికీ ప్రతీదీ... దానికి చెప్పే చేస్తాను. ఈసారే... ఎందుకో ఇలా చేసాను.

పిల్లికి కాలు కాలిందో లేదో తెలియదుకానీ, అది ఇటూ, నేను అటూ, అదిగోడమీదా నేను కిందా పచార్లు మొదలెట్టాము.

ఒకచేత్తో దినపత్రిక మరో చేత్తో కాఫీ తెచ్చింది ఇల్లాలు. "కాఫీ తాగి గ్లాసు ఏ గోడమీదో పెట్టక... తెచ్చి... లోపలపెట్టండి." హుకుం జారీచేసి సమాధానం కోసం చూడకుండా లోపలికి వెళ్ళిపోయింది. ఇలా... ఉండాలనుకుంటాను. కుదిరిచావదు కదా!

తప్పా...! అంటే తప్పే. కాదూ అంటే కాదు. అసలు ఈవేళ పాలు ఆలస్యంగా రావడం వల్లే... ఈ గొడవంతా. ఈ కాఫీ ఏదో ముందే పడి ఉంటే... ఈ గొడవ ఉండేదేకాదు. బుర్రంతా ఖాళీగానూ కొంచెం సేపటికి గందరగోళంగానూ తయారైంది. మళ్ళీ కాఫీ తాగితే బాగుంటుందేమో!

అప్పుడు గుర్తొచ్చింది గోడమీది గ్లాసు. పిల్లి ఒక కాలితో తొక్కిపెట్టి నాలుకతో చప్పరిస్తోంది. దగ్గరకి వెళ్ళా... బెదిరింది. గ్లాసు అవతలివైపు పడిపోయింది. అవతలివైపు శాస్త్రిగారి ఇల్లు అక్కడికి వెళ్ళి దాన్ని తీసుకురావాలి. అక్కడ వాళ్ళు మడిబట్టలు ఆరేసుకుంటారు. నేనా... 'తడీ మడీ' లేనివాణ్ణి... వెడితే బాగుండదేమో!

వెధవపిల్లి... వెధవగ్లాసు.

ఐతే... ఈ సందర్భంగా ఖాళీ అయిన బుర్రలో ఆచారాలూ - వ్యవహారాలూ - గోడలూ - పిల్లులూ దూరాయి.

ఈ వేళ సెలవుగదా! తలకి రంగేసుకోకూడదూ!

మళ్ళీ వసారాలోకి ప్రశ్నతో వచ్చింది శ్రీమతి.

ఔను. రంగేసుకోవాలి. రేపు యూనియన్ మీటింగు. పంకజం కూడా వస్తుంది. పెదవి చివర చిన్న నవ్వు విరిగి ఒరిగిపోయింది. క్రిందటిసారి మీటింగ్‌కి కొత్తగా కట్టించిన పళ్ళతో వెళ్ళాను. మౌనంగా కూర్చొన్నా, శ, ష, స లకి ఉచ్చారణలో తేడాలు తెలియడంలేదు. గొంతుకకి ఏదో అడ్డం పెట్టినట్లు భావన. మౌనం పాటించా. స్టాఫ్‌కి సంబంధించిన వ్యవహారాలలో కొంచెం నోరుచేసుకొనే మనిషిని.

అణువణువూ పరీక్షిస్తుందేమో పంకజం.

ఏమండీ మాట్లాడరేం?... నోట్లో ముత్యాలు రాల్తాయా!

చిన్న చమత్కారిక విసరింది.

మొత్తంమీద పంకజానికి దొరికిపోయా.

రేడియోలో 'దాచిన దాగదు వలపూ' పాట వినిపిస్తోంది.

"దాచిన దాగదు వయసూ" అని కూడా వినిపిస్తోంది.

మిమ్మల్నే పొద్దుటనించీ కాలుకాలిన పిల్లిలా అలా తిరుగుతారేం..? రంగేసుకోవాలి, అది ఆరాలి, భోజనం చేసి చెల్లెలు గారింటికి వెళ్ళాలి. అదీ సంగతి... అలా చెప్పు.

చెప్పొద్దూ, నాకు 'పిల్లిగారింటికి వెళ్ళాలి' అన్నట్లు వినిపించింది.

గ్లాసు గుర్తొచ్చింది. అసలా పిల్లి నల్లమచ్చల తెల్లపిల్లా, తెల్ల మచ్చల నల్లపిల్లా! ఇదో సమస్య.

గోడ దగ్గరకి వెళ్ళా. గోడమీంచి తొంగి చూడడం సభ్యతాకాదు, సంస్కారమూ కాదు.

మెల్లిగా కదిలి వీధి వైపు నుంచి శాస్త్రిగారి గుమ్మం ముందు నిలుచున్నా. ఆయన తదేకంగా బాలయోగి మృతి వార్తలు చదువుకొంటున్నారు. చిన్నగా గొంతు సవరించా. పేపరు క్రింద పెట్టి కళ్ళజోడులోంచి వీధి వైపుకి చూసి, అరె... మీరా... రండి, రండి అంటూ ఆహ్వానించారు.

వెంటనే గ్లాసడిగితే... ఏం బాగుంటుంది?

కాసేపు అయోధ్య, రామ జన్మభూమి, హెలీకాప్టర్ ప్రమాదాలు అంటూ ఏవో మాట్లాడి గోడవైపు చూసా, అడ్డంగా మడి బట్టలు ఆరేసి ఉన్నాయి. గ్లాసు కనబడలేదు. ఉదయాన్నించీ పడుతున్న మధన చాలక ఈ గ్లాసు గొడవ ఒకటి.

అలా రాయకుండా ఉంటే బాగుండేది. ఏం చెయ్యను.

అపార్థం చేసుకొంటే... చేసుకుంటాడు. ఆ రెండు ముక్కలకీ వాడు గాఢంగా ప్రతిస్పందించనూ వచ్చు, తేలికగా స్పందించనూ వచ్చు.

"రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరతునా!'' అన్నాడు చిన్నయసూరి. చిన్నయసూరితో బాటే పంచతంత్రమూ, చాంద్రాయణ వ్రతం చేసిన పిల్లీ, పిల్లితోబాటు కాఫీగ్లాసూ గుర్తొచ్చాయి.

శాస్త్రి గారి భార్య గ్లాసుతో 'టీ' తెచ్చింది.

కాఫీ-టీలలో టీమడిట. ఎప్పుడో విన్నాను.

అరుగుకొసని గ్లాసుపెట్టి, పలకరింపు నవ్వు నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

శాస్త్రిగారేదో చెబుతున్నారు.

టీ తాగడం పూర్తయింది. గ్లాసు తిప్పుతూ కూర్చొన్నా. ఎంత వద్దనుకున్నా గ్లాసు అంచుల చుట్టూ నా చూపులు వృత్తాలు గీస్తున్నాయి.

ఏదో... అడగడానికో, చెప్పడానికో వచ్చి తటపటాయిస్తున్న సంగతి చూచాయిగా శాస్త్రిగారు కనిపెట్టి ఉంటారు.

ముందు జాగర్త చర్యగా... ఆర్థికపు అవసరాలూ, అనుకోని ఇబ్బందులూ టాపిక్‌లోకి మార్చారు.

ఒకటి రెండు దాకా ఐతే నేను సర్దుతాను లెండి అన్నాను.

ఆయన ముఖం తెరిపిగా కనబడింది.

ఇందాకటి చీర కాక మరొకటి కట్టుకొని ఆరిన బట్టల్ని తీసి కుచ్చిళ్ళు పెడుతోంది శాస్త్రిగారి భార్య. గోడవార గ్లాసు లేదు.

మీరిందాకటి నుంచి గోడవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

అది మోటారు. పెద్దాడు వేయించాడు. 'సుగుణ' పంపు అన్నారు శాస్త్రిగారు. యధాలాపంగా హార్స్‌పవరెంత? అన్నాను. ఎంతో చెప్పారు. బయలుదేరడానికి లేచాను. ఏదో ఆదివారం మూలాన మామీద దయకలిగింది

అంటూ వీధి దాకా సాగనంపి గేటువేసుకున్నారు శాస్త్రిగారు.

కనీసం స్నానమైనా చెయ్యండి, వంటయింది. "బద్ధకంతో పుట్టాడు మహానుభావుడు"... అని... నాలుగడుగులేసి... ఉత్తరాలేవో రాయాలన్నారు రాయకూడదూ! ప్రశ్నార్థకాన్ని నా మొఖాన కొట్టి లోపలికి వెళ్ళిపోయింది – గ్లాసు గొడవ మెల్లిగా వదిలించుకొంటున్నా. ఉత్తరం గురించి కదిపి వెళ్ళిపోయింది.

రాస్తే రాస్తాను. నా యిష్టం వచ్చినట్లు రాస్తాను. ఏదైతే అదౌతుంది. డబ్బాలో ఆదివారమనేనా చూడకుండా వెయ్యడం తప్పే. జిగురు గురించి కూడా ఆలస్యం చెయ్యకుండా పెదాలతో తడిపి మరీ అతికించి వెయ్యడం తప్పే. చూస్తా. ఏం జరుగుతుందో... ఈ వారం గడిస్తే కానీ దీనికి సమాధానం వస్తే కానీ.. నా ప్రయోజకత్వం తెలియదు.

నన్ను నేను సంబాళించుకోలేకపోతున్నా.

ఒకసారి మొండిగా... ఒకసారి బేలగా...

ఒకసారి బెంగగా.

చెప్పొద్దూ రోజూ చూసేవాళ్ళు గమనించడం లేదు కానీ పదిరోజుల క్రితం చూసినవాళ్ళు మాత్రం ఏదో మహా అనారోగ్యంతో బాధపడుతున్నానని అనుకొంటారు.

మొత్తానికి ఈ విధంగా వారం గడిచింది.

ఈ వారంలో నా దిన చర్యలో గణనీయమైన మార్పు

సాయంకాలాలు ఇంటికి పెందరాళే జేరడం.

రాగానే 'టపా' చూడడం.

సైకిలు గోడకి జేరేసి లోపలకి అడుగుపెట్టా.

చేతిలో కవరూ, కాఫీలతోటి ఎదురైంది శ్రీమతి.

కాఫీ చప్పరిస్తూ ఉత్తరం చదివాను.

అన్నయ్యా! వయసు తాలూకు చాదస్తం నీ ఉత్తరంలో బాగా కనబడుతోంది. నీ ఉత్తరానికి సమాధానం రెండో కాయితంలో ఉంది. అది వదినకి ఇచ్చి చదువుకోమను. ఆతృత... ఆ ఉత్తరంలో ఏం 'లిరిక్' ఉందో కంగారు. లాక్కుని చదివాను.

అన్నయ్యని కాస్త విశ్రాంతి తీసుకోమను. మంచి డాక్టరుకి నేను వచ్చినప్పుడు చూపిస్తాను. కంపెనీ యూనియన్ వ్యవహారాలలో తలదూర్చవద్దని చెప్పు. సైకిల్ మానేసి మోపెడ్ కొనుక్కోమను. దీంతో డిడి పంపుతున్నా.

నా భాష నా తమ్ముడికి కాక ఎవరికి అర్థమౌతుంది.

హృదయ శల్యం తొలగినట్లయింది.

కాన్వెంట్ పిల్లాడు పుస్సీకేట్... పుస్సీకేట్ రైమ్ పాడుతున్నాడు. గ్లాసు గుర్తొచ్చింది.

ఇప్పుడు నేను 'కాఫీ' తాగుతున్నది

వారం క్రితం గోడకి అవతల పడిపోయిన ఆ గ్లాసుతోటే.

## వాల్ట్ విట్మన్

కవి, విమర్శకుడు అయిన వాల్ట్ విట్మన్ 1819 మే 31న లాంగ్ ఐలాండ్(న్యూయార్క్)లో జన్మించాడు. ఆఫీస్ బాయ్‌గా, ముద్రాపకుడిగా, బడిపంతులుగా జీవించాడు. విలేఖరిగా కూడా పనిచేశాడు. తొలి పద్యాలు 'లీవ్స్ ఆఫ్ గ్రాస్'గా వెలువడ్డాయి. 'పాసేజ్ టు ఇండియా' గీతంలో భారతదేశానికి ఋణపడి ఉన్నానన్నాడు. 1892 మార్చి 26న మరణించాడు.

## 'కవిత్వమంటే...?'

"కవిత్వం బ్రహ్మ పదార్థం లాంటిది. ఏ ఒక్క నిర్వచనానికీ లొంగదు. అన్ని నిర్వచనాలూ దాన్ని స్పృశిస్తాయి. కవిత్వం మనస్సుకీ, ఉద్రేకాలకీ సంబంధించినది. ఈ మనస్సునీ, ఉద్రేకాల్నీ కొలిచే సరైన మానం ఇదివరకు లేదు. ఇకముందు రాదు అని చెప్పవచ్చును. అంతవరకూ కవిత్వానికి సరైన నిర్వచనం రాదు''– తిలక్ (ఆనందవాణి పత్రిక ఇంటర్వ్యూలో).